క్లుప్తంగా

శివ భక్తుల ప్రత్యేక పూజలు



పల్లకీసేవలో పాల్గొన్న శివ భక్తులు

కొడంగల్: అప్పాయిపల్లి శివాలయంలో శివ మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి శివ భక్తులు స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. పలకీలో స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొడంగల్‌లోని మహదేవుని ఆలయంలో దేశ్‌ముఖ్ కుటుంబ సభ్యులు రావులపల్లి సర్పంచు రమేష్‌రెడ్డి, నిజలింగప్ప తదితరులు పూజలు చేశారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం

కుల్కచర్ల: మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నట్లు పాంబండ రామలింగేశ్వర దేవస్థానం ఆలయ చైర్మన్ రాములు, ఈఓ సుధాకర్ తెలిపారు. సోమవారం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ దేవస్థానంలో పాలకవర్గ సభ్యులతో నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. శివరాత్రిని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ పూజారి పాండుశర్మ, లక్ష్మయ్య, సంజీవ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బుడగజంగాల ఉన్నతికి కృషిచేయాలి



కలెక్టర్ నారాయణరెడ్డిని సన్మానిస్తున్న బుడగజంగాల నేతలు

కుల్కచర్ల: ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బేడ, బుడగజంగాల ప్రజలకు అందేలా చూడాలని బుడగజంగాల సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్, చౌడాపూర్ మండల అధ్యక్షుడు భీమయ్య కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని బుడగజంగాలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఉపాధి లేక వివిధ ప్రాంతాలకు వెళ్లి జీవించాల్సిన పరిస్థితని, కావున వారి ఉన్నతికి కృషిచేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో చంద్రయ్య, నర్సింహులు, మహేశ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు



మొక్కలకు పాదులు చేయిస్తున్న సర్పంచ్ రాజిరెడ్డి

దోమ: ఉపాధిహామీ సిబ్బందితో మొక్కలకు నిరంతరం నీరు అందించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. సోమవారం దోమ మండల కేంద్రంలో బాస్‌పల్లి, దోమ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు ఉపాధి సిబ్బందితో అవెన్యూ ప్లాంటేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటిన ప్రతి చెట్టుకు పాదులు చేసి, ప్రతిరోజు నీరు అందించాలని చెప్పారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని చెట్ల సంరక్షణలో సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ప్రతి మొక్కను కాపాడుకునేందుకు కృషి చేయాలన్నారు.

బీఎస్పీ మైనార్టీ పట్టణ కన్వీనర్‌గా రహీమ్



నియామక పత్రం అందుకుంటున్న మహ్మద్ రహీమ్

తాండూరు టౌన్: బహుజన్ సమాజ్ పార్టీ మైనార్టీ తాండూరు పట్టణ కన్వీనర్‌గా మహ్మద్ రహీమ్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ నియామకం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రహీమ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో పార్టీని మైనార్టీలకు చేరువ చేయడంతో పాటు, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి రాజేశ్వర్, జిల్లా మైనార్టీ కన్వీనర్ అమ్జద్ పాషా, అసెంబ్లీ అధ్యక్షుడు అరుణ్‌రాజ్, వెంకటప్ప, జైరాం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలతో ఫిర్యాదు చేయండి

- అర్జీదారులు సమస్యలపై అవగాహనతో రావాలి
- కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ప్రజావాణిలో తహసీల్దార్లు



బొంరాస్‌పేట: అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ షర్మిలకు వినతి పత్రం ఇస్తున్న కొత్తూరు రైతులు

మోమిన్‌పేట: భూ సమస్యలకు సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లతో ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ చెప్పారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలు ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం తగిన పత్రాలను జతపర్చాలని, సమస్యలను చెప్పే ముందు పూర్తి అవగాహనతో రావాలని తహసీల్దార్ సూచించారు. ఫిర్యాదులో పేర్కొన్న విధంగా మీ సేవలో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని, ధరణి సమస్యలను మీ సేవలో దరఖాస్తు చేసి తగిన ఆధారాలను తహసీల్ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.

ప్రజాదర్బార్‌లో 5 ఫిర్యాదులు

నవాబుపేట: తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఐదు ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ రవీందర్ తెలిపారు. సుమారు 30 మంది రైతులు ఇది వరకు ఇచ్చిన ఫిర్యాదులను మళ్లీ తీసుకువచ్చారని, వారందరికీ వారి సమస్యలపై చర్చించి, సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పినట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, సిబ్బంది తదితరులున్నారు.

అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి

బొంరాస్‌పేట: అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని రైతులు ప్రజావాణిలో తహసీల్దార్ షర్మిలకు వినతులు సమర్పించారు. అనంతరం భూ సమస్యను వివరించారు. మండల పరిధి కొత్తూరులో సర్వే 360లో ఉన్న 300 ఎకరాల అసైన్డ్ భూమిని 160మంది రైతులు సాగుచేసుకుంటున్నారని, ఇందులో 130మందికి ఇదివరకు పట్టాలు ఇచ్చారని, మిగిలిన 30మందికి కూడా ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ సంఘం అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, కేఎన్‌పీఎస్ లక్ష్మయ్య, చిన్నయ్య, ప్రవీణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

రెండు దరఖాస్తులు

కొడంగల్: ప్రజావాణిలో తహసీల్దార్ బుచ్చయ్యకు భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇద్దరు వ్యక్తులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఒక అర్జీని అక్కడికక్కడే పరిష్కరించగా.. మరో దరఖాస్తుకు సంబంధించిన పత్రాలను చూసిన తర్వాత పరిష్కరిస్తామని తహసీల్దార్ అర్జీ దారునికి చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

వినియోగించుకోవాలి

తాండూరు రూరల్: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చిన్నప్పల నాయుడు అన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో 6 దరఖాస్తులు వచ్చాయని, ప్రతిరోజు ధరణి సమస్యలపై సహాయకేంద్రం కూడా ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ చెప్పారు.

కోట్‌పల్లిలో మూడు దరఖాస్తులు

బంట్వారం: కోట్‌పల్లి రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మూడు దరఖాస్తులు వచ్చాయి. వీటిని తహసీల్దార్ రసూల్ స్వీకరించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీటీ భరత్‌గౌడ్, ఆర్ఐ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. బంట్వారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు కూడా అందలేదని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

దోమ: రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి 19 రకాల ఫిర్యాదులు స్వీకరించామని, ముఖ్యంగా జీఎల్ఎం, పెండింగ్‌లో ఉన్న విరాసత్, మ్యుటేషన్, సివిల్ సమస్యలు, ప్రభుత్వ భూములకు సంబంధించిన ఫిర్యాదులు అందాయని చెప్పారు. వాటిని పరిష్కరించేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. రైతులకు భూ సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు.



నవాబుపేట: దరఖాస్తు దారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రవీందర్



మోమిన్‌పేట: రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్



కొడంగల్: తహసీల్దార్ బుచ్చయ్యకు దరఖాస్తు ఇస్తున్న పలువురు

హమాలీలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన నేతలు



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో హమాలీలు, సీఐటీయూ నేతలు

తాండూరు టౌన్: తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో పని చేస్తున్న హమాలీ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ హమాలీ కార్మిక సంఘం.. సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు భీమప్ప, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా మార్కెట్ యార్డును నమ్ముకొని జీవనం సాగిస్తున్న హమాలీలకు సొంత ఇళ్లు లేవని, చాలీచాలని కూలీ డబ్బులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కావున హమాలీలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు, వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే ఇళ్లల్లో పాచిపని చేసే మహిళలకు రూ.5వేల జీతం ఇప్పించాలని, కార్మిక చట్టాలు అమలయ్యేలా చొరవ చూపాలన్నారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం రూ.10 లక్షలు కేటాయించాలని, కార్మికులు చనిపోతే అంత్యక్రియలకు రూ.20 వేల ఆర్థికసాయం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం కార్యదర్శి బాలప్ప, కోశాధికారి రాజేష్, ఉపాధ్యక్షులు భద్రయ్య, శ్రీనివాస్, సహ కార్యదర్శి వెంకటేష్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు నివారణకు చర్యలు

- జీపీ నిధులతో డ్రైనేజీ కాల్వల నిర్మాణం
- ఎంపీడీఓ చంద్రశేఖర్

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: 'రోడ్డుపైనే మురుగు ప్రవాహం' అనే శీర్షికతో సోమవారం 'సాక్షి'లో ప్రచురితం అయిన వార్తకు ఎంపీడీఓ చంద్రశేఖర్ స్పందించారు. మండల పరిధిలోని దోర్నాల్ గ్రామానికి వెళ్లిన ఎంపీడీఓ.. రోడ్లపైన, ఇళ్లమధ్య ప్రవహిస్తున్న మురుగునీటిని పరిశీలించారు. సీసీరోడ్లపై పారుతున్న మురుగును నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శి కిషన్‌ను ఆదేశించారు. ఇళ్ల మధ్య పారుతున్న మురుగునీటిని నివారించేందుకు జీపీ నిధులతో మురికికాల్వలు నిర్మించేందుకు ప్రయత్నిస్తామని ఎంపీడీఓ చెప్పారు. నిధుల సోర్స్‌ను బట్టి క్రమంగా పనులు చేయిస్తామని ఆయన వెల్లడించారు.



రోడ్డుపై పారుతున్న మురుగును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

లావుణి భూములపై హక్కులు కల్పిస్తాం

మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి ప్రసాద్‌కుమార్

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే లావుణి పట్టా భూములపై అన్ని హక్కులు రైతులకు కల్పించేలా చట్టం తీసుకువస్తామని మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ స్పష్టం చేశారు. హాత్‌సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వికారాబాద్ మండలంలోని పులుమద్ది గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అని, రాబోయే ఎన్నికల్లో పార్టీని ఆదరించి రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని కోరారు. తొమ్మిది సంవత్సరాలుగా బీజేపీ, బీఆర్ఎస్‌లు చేసిందేమీ లేదని విమర్శించారు. వికారాబాద్ మండలంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అభివృద్ధికి సంబంధించిన 44 జీవోలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కదిలించి వికారాబాద్‌కు నిధులు తీసుకురావాలని ఆయన ఎమ్మెల్యేకు సూచించారు. అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, 57ఏళ్లకే ఇంట్లో దంపతులిద్దరికీ పింఛన్ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, జిల్లా సీనియర్ నాయకుడు కమల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, అయూబ్ అన్సారీ, శివయ్య, మనోహర్‌గౌడ్, బస్వరాజు, హన్మంతు, జంగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతి ఉద్యోగులు

ధారూరు: పంచాయతి కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ జీపీ ఉద్యోగులు, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధారూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీశైలం, శ్రీనివాస్, అశోక్‌కుమార్, పెంటయ్య, బోనయ్య తదితరులు పాల్గొన్నారు.

శివ భక్తులకు అన్నదానం

బంట్వారం: శివ మాలధారులకు ముస్లిం యువకుడు చాంద్‌పాష అన్నదానం చేశారు. కోట్‌పల్లి మండలంలోని ఇందోల్ గ్రామానికి చెందిన పాష వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. సోమవారం ఆయన ఇందోల్ శివాలయంలో పడిపూజ నిర్వహించి తన భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఫౌండేషన్ చేయూత అభినందనీయం

పూడూరు: పదో తరగతి విద్యార్థులకు బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడిమెటీరియల్ అందజేయడం అభినందనీయమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎన్కేపల్లి మోడల్‌స్కూల్‌లో చదువుతున్న 92 మంది పదో తరగతి విద్యార్థులకు పుస్తకాలు అందజేసి ఆమె మాట్లాడారు. పేద విద్యార్థులకు చేయూతనిచ్చి, పాఠశాల విద్యను ప్రోత్సహించేలా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, సిరాజ్, గంగాధర్‌గౌడ్, మధు, ఉపాధ్యాయులు అరుణ, సరిత పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

- రేపటి నుంచి ఏప్రిల్ వరకు స్నాక్స్
- ఒక్కో విద్యార్థికి రూ.15 చెల్లింపు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

దౌల్తాబాద్: విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30గంటల నుంచి 9.30గంటల వరకు సాయంత్రం 4.45గంటల నుంచి 5.45గంటల వరకు సబ్జెక్టు వారీగా బోధిస్తున్నారు. అలా చెప్పిన పాఠ్యాంశాలపై ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తున్నారు. ఉదయాన్నే బడికి వచ్చే విద్యార్థులు అర్ధాకలితో సాయంత్రం వరకూ ప్రత్యేక తరగతుల్లో కూర్చోవాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజనం మినహా ఇంటి నుంచి వచ్చి తిరిగి వెళ్లే వరకూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పది చదివే విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3నుంచి 23 వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఫిబ్రవరి 15నుంచి ఏప్రిల్ 1వరకు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు సాయంత్రం పూట 34 దినాలు స్నాక్స్ అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున నిర్ణయిస్తూ అవసరమైన నిధులను కేటాయించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారా ఆరోగ్యకరమైన స్నాక్స్ అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిధులు ఒకటి రెండు రోజుల్లో ఆయా పాఠశాలల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఖాతాల్లో జమ కానున్నాయి.

నిధులు ఇలా..

మండలంలో 8 ఉన్నత పాఠశాలల్లో 450 మంది పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున అందించేందుకు నిర్ణయించారు. ఇలా 34 రోజులకు గానూ అవసరమైన బడ్జెట్ కేటాయించారు. ఈ విధానం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తున్న గ్రామస్తులు

గ్రామ దేవతకు పూజలు

ధారూరు: గ్రామ దేవత మైసమ్మ ప్రతిష్ఠబూని ఏడాది గడిచిన సందర్భంగా గ్రామస్తులు సోమవారం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి హోమం చేసి, అభిషేకం జరిపారు. అనంతరం భక్తులకు పూజార్లు తీర్థప్రసాదాలు అందజేశారు. సర్పంచు చంద్రమౌళి, పీఏసీఎస్ డైరెక్టర్ సుధకర్‌గౌడ్, గ్రామ పెద్దలు బుజ్జయ్యగౌడ్, చిన్నయ్యగౌడ్ పాల్గొన్నారు.

ప్రజల చూపు.. బీజేపీ వైపు



తాండూరు రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్

- హామీలను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం
- అటకెక్కిన డబుల్ బెడ్రూం స్కీం
- బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి
- బీజేపీ భరోసా కార్నర్ మీటింగులో కమలనాథులు

బొంరాస్‌పేట: తెలంగాణ ప్రజలు భారతీయ జనతా పార్టీ వైపు మొగ్గుచూపుతున్నారని, ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలనను చూసిన ప్రజలు హర్షం వ్యక్తంచేస్తూ.. సీఎం కేసీఆర్ పరిపాలనపై పెదవి విరుస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. శక్తికేంద్రం–బీజేపీ భరోస కార్నర్‌లో భాగంగా సోమవారం తుంకిమెట్లలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో పార్టీని బూతుస్థాయి నుంచి బలోపేతం చేసి, రానున్న ఎన్నికల్లో రాష్ట్రం, కేంద్రంలో భాజపా జెండాను ఎగుర వేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, రాష్ట్ర కిసాన్‌మోర్చ అధికార ప్రతినిధి కూర వెంకటయ్య, బాబయ్యనాయుడు, జిల్లా కార్యదర్శి చంద్రప్ప, బూత్ అధ్యక్షులు, బూత్ కార్యవర్గం పాల్గొన్నారు.

విసుగు చెందిన ప్రజలు

తాండూరు రూరల్: బీఆర్ఎస్ పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగు చెందారని, ముఖ్యమంత్రి కేసీఆర్ మాటల గారడిని నమ్మే పరిస్థితిలో లేరని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మల్కాపూర్‌లో శక్తికేంద్రం ఇన్‌చార్జి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగోస–బీజేపీ భరోస కార్నర్ మిట్టింగులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక్క ఊరికి ఒక్క డబుల్‌బెడ్‌రూం కూడా ఇవ్వడం లేదని, కేసీఆర్ నియంత తరహాలో పాలన సాగించడం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని చెప్పారు. రైతులకు రుణమాఫీ చేయడంలేదని, కొత్త రేషన్లు కార్డు, పింఛన్లు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, నాయకులు చిరంజీవి, నరేందర్, ప్రశాంత్, సాయిగౌడ్, సోమశేఖర్, కృష్ణ, అంజిలప్ప, తుల్జరాంలు పాల్గొన్నారు.



కుల్కచర్ల: కామునిపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రహ్లాదరావు



బొంరాస్‌పేట: మాట్లాడుతున్న పార్టీ నాయకులు

అవినీతిరహిత పాలన బీజేపీతోనే సాధ్యం

కుల్కచర్ల: అవినీతిరహిత పాలన బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాదరావు అన్నారు. కామునిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బీజేపీ స్ట్రీట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేస్తే.. రాష్ట్రం వాటిని అడ్డుకుంటున్నదని ఆరోపించారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను ఇస్తామని చెప్పిన బీఆర్ఎస్.. మాటతప్పిందని, కేసీఆర్ నియంతృత్వ పాలనను తలపిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. పేదల పక్షాన పోరాటం చేయాలని కమల నాథులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, నాయకులు కిష్టారెడ్డి, కాటనిపల్లి అంజిలయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో గ్రామాల అభివృద్ధి

రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: పాడి అభివృద్ధితోనే గ్రామాలు ఆర్థికంగా, సామాజికంగా స్వయం సమృద్ధిని సాధిస్తాయని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 35 పశువులకు చుడి నిర్ధారణ పరీక్షలు, 15 పశువుల్లో గర్భకోశ వ్యాధి చికిత్సలు, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో పశువులకు వైద్యం అందిస్తూ అధిక పాల దిగుబడి రాబట్టవచ్చునని చెప్పారు. మేలు రకం పశువుల ఎంపిక ద్వారా అధిక ఆదాయం పొందవచ్చున్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే లాభాలు అధికంగా వస్తాయని తెలిపారు. నాణ్యమైన పశుగ్రాసం అందించడం వల్ల మరింత ఆర్థికంగా లబ్ధి పొందవచ్చన్నారు. పాడి పశువుల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు, వైద్యుల సలహాలు తీసుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శకుంతల, ఎంపీటీసీ సునిత, పశువైద్య సిబ్బంది శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.